

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - ఏడవ కథ -

ప్రతిరోజూ పుదయాన వాకింగ్ నుండి వస్తూ వస్తూ, ఒక బండి దగ్గర కూరగాయలు తీసుకుంటాను. ఆరోజు కూడా పొద్దున్నే బండి దగ్గర ఆగాను. మామూలు గా అయితే భార్యాభర్తలు ఇద్దరూ ఉంటారు. బండికి కొద్దిగా వెనగ్గా సరుకుల షాపుకూడా ఉంటుంది వాళ్ళకు. షాపులో పనీ, కూరగాయల పనీ ఎక్కువగా ఆడమనిషే చూసుకుంటుంటుంది. బండి దగ్గరుండే మగమనిషి ఎక్కువగా, స్టూల్ మీద కూర్చుని నిద్రపోతుంటాడు. లేకపోతే పక్కవాళ్ళతో కబుర్లు చెప్తుంటాడు.

ఆ రోజున ఆమె లేదు. భర్త ఒక్కడే ఉన్నాడు.

రెండు మూడు రకాల కూరగాయలు చెపితే తూచి బుట్టలో వెయ్యడానికి నానా అవస్థ పడ్డాడు. మొత్తానికి నేనడిగినవన్నీ తూచి సంచిలో వేసి , కార్లో పెట్టాడు.

“ఎంత?”

“వంకాయలు పదేను, గోరుచిక్కుళ్ళు పది, గోంగూర పది... ఆ.....” మూడూ కలిపి ఎంతో చెప్పలేక , " లెక్క చెప్పటాకి మాయావిడ లేదు. ఉప్పుడే ఇంటికాడికెల్లింది." కాసేపాగమన్నాడు.

"ఈ మాత్రం లెక్క నేను వేస్తాలే. ముప్పై అయిదు." తీసుకోమంటే వినడు.

మాయావిణ్ణి రానీయమంటాడు.

“అదొచ్చి అరుసుద్ది. ఇదిగో ఈ సందు సివరకే ఎల్లింది. వచ్చేత్తది.”

ఇదిగో వస్తుంది , అదిగో వస్తుంది అన్న అరగంటకు ఆవిడొచ్చి, డబ్బు తీసుకుంది. నన్నాపేసినందుకు నొచ్చుకుంది.

“ రేపిచ్చే పనికదా అమ్మా. ఆపేసినావే” అని మొగుణ్ణి కసిరింది.

“ఇట్టనే అంటదిగానీ , డబ్బుల్తీసుకోకుండా పంపిత్తే సంపేత్తది” అంటూ నవ్వుతున్నాడు. కొద్దిగా వెర్రితనం కలిసిన నవ్వు.

కూడికలు రాకపోతేనేమి, ఆవిడ పరువు బాగానే తీసేశాడు.

ఓ రోజు కూరగాయలు తీసుకున్నాక దగ్గరకొచ్చి మాట్లాడింది. “ మా యమ్మాయిని ఓ పాలి ఆస్పత్రికి తీసుకురావాలమ్మా, ఎప్పుడు తీసుకురమ్మంటారో సెప్తే...." అంది.

“సాయంత్రం తీసుకురా.”

“అమ్మా , సందకాడ బేరాలెక్కువుంటయ్యమ్మా,” అని, వాళ్ళ నాన్న, అమ్మాయి కలిసి వస్తారంది.

“ఇంతకూ ఏం చూపించాలి.”

“నీళ్ళోసుకుందమ్మా. నాలుగోనెల.”

"అంతే కదా, నేను చూస్తాలే. పంపించు."

“అయ్యాకూతుళ్ళిద్దరికిద్దరే. ఏం జెప్పినా బుర్రకెక్కదు. అల్లుడికి సెప్పండమ్మా మందులయా ఎట్టా వాడాలో” అంటూ కూరల సంచి వెనక సీట్లో పెట్టి జాగ్రత్తగా తలుపు వేసింది.

★★★★

ఆ సాయంత్రం కూతుర్ని తీసుకొచ్చాడు కూరగాయలతను.

“పీజియ్యమంటావేందీ , డాట్టరమ్మ మా బండికాడే కూరగాయలు తీసుకుంటది రోజూ.”

“నువ్వారికే ఇస్తన్నావా కూరగాయలు?” నా కన్సల్టేషన్ రూం బయట మాటలు వినిపిస్తున్నాయి.

నా తలుపు తోసుకొచ్చి “పీజియ్యమంటంది నర్సు” అన్నాడు.

“ఊరుకో..” అన్నట్లు మా నర్సుకు సైగ చేశాను.

“నేజెప్పలా..” అన్నాడు నర్సుమీద గెలిచిన విజయంతో.

పేరు రాఘవరావట. పక్కనే నిలబడ్డ అతని కూతుర్ని చూశాను. అమ్మాయి చిన్నపిల్లే. మొన్నే పద్దెనిమిది వెళ్ళిందట. తేనె కళ్ళు. బుగ్గల బూరిలా ఉంది. పసుప్పచ్చ ఓణీ, కాఫీ రంగు పరికిణీ. హాస్పిటల్ కు రావడం ఇష్టం లేనట్లు , మొహం కోపంగా ఉంది. ఎప్పుడెళ్ళిపోదామా అన్నట్లు చూస్తోంది.

ఆ అమ్మాయిని పరీక్షకు పడుకోబెట్టాలంటే నర్సులందరికీ తలప్రాణం తోకకొస్తోంది. అమ్మో భయం భయం అంటూ హాస్పిటల్ అంతా తిరుగుతోంది తప్ప టేబిల్ మీద పడుకోదు.

“మా కిట్టయ్య కు తప్ప, ఇంకెవురి మాటా ఇనదు” అన్నాడు రాఘవరావు.

కిట్టయ్య ఎవరన్నట్టు చూస్తుంటే “అదే మా అల్లుడు “

“అయితే పిలిపించు.”

జేబులోంచి చిన్న మాసిపోయిన నోట్ బుక్ తీశాడు. “ఇందులో కిట్టయ్య అని ఉంటది. ఆడికి ఫోన్ సేసి రమ్మనండి” అంటూ నా చేతికిచ్చాడు.

వెంటనే కాంపౌండర్లు ఆ నోట్ బుక్ తీసుకుని లాండ్ లైన్ నుండి ఫోన్ చెయ్యటానికి బయటికెళ్ళారు.

“ ఇంత చిన్న పిల్లకు అప్పుడే పెళ్ళిచేశారెందుకూ?”

నవ్వాడు.

“ఏందోనమ్మా, అట్టా తోసుకొచ్చింది. మా యాడది ఏటవకాడ ఆళ్ళ పిన్నమ్మోళ్ళు ఇళ్ళల్లోకి ఎల్తన్నారంటే మా పిల్లదాన్ని కూడా తీసుకెల్లింది. ఆడ ఆ పిన్నమ్మ, నీ పిల్లను నా మనవడికియ్యాల్సిందేనని కూసుందంట. అక్కడికక్కడే సంబంధం మాట్టాడుకునీ, లగ్గవదీ పెట్టుకుని వచ్చింది. ఆ యవ్వారాలన్నీ మాయాడదే సూసుకుంటది. ”

ఇంత పిచ్చి పిల్లకు ...పెళ్ళి అదీ ఇంత చిన్న వయసులో . ఏం తొందరొచ్చిందీ!!

"ఆ అబ్బాయి ఏం చేస్తాడు. ?"

ఆటో తోలుకుంటాడంట.

" మా కిట్టయ్య బలే ఉశారైన మడిసి. అమ్మా అయ్యా లేరు. ఊళ్ళో రొండెకరాల పొలవుంటే అన్నకు కౌలుకిచ్చాడు. మా పిల్లను కాలు కిందబెట్టనియ్యడు . ఈ మజ్జెన సొంతానికి ఆటో కొన్నాడు ."

అతనొచ్చేవరకూ తండ్రీ కూతుళ్ళు బయట రిసెప్షన్ లో కూర్చున్నారు.

ఓ పది నిముషాల తర్వాత "మా కిట్టయ్యొచ్చాడు." అంటూ లోపలకొచ్చి సంబరంగా చెప్పాడు రాఘవరావు.

'ఆహా..' అన్నట్టు తలూపితే

తలుపు తీసి "ఒరే కిట్టయ్యా , కిట్టయ్యా" అని పిలుస్తున్నాడు.

"అలా అరవకూడదు." నర్సొచ్చి గదిమింది.

ఆ అమ్మాయి భర్త వచ్చాడు. సన్నగా పొడుగ్గా ఉన్నాడు. రెల్లు గడ్డిలా ఉన్న జుట్టుకు మధ్యపాపిడి తీశాడు. ఎరుపు తెలుపు గళ్ళచొక్కా. మెడలో నల్ల తాడు లాంటి గొలుసు. ఆ అమ్మాయి అతణ్ణి అంటిపెట్టుకునే ఉంది. అమ్మాయిని లోపల పరీక్షకు పడుకోబెట్టమని చెప్తే అతనే తీసుకెళ్ళాడు.

"ఈ అమ్మాయికి పరీక్ష, స్కానింగ్ చేద్దాం. టెస్టుల కోసం బ్లడ్ కూడా ఒకేసారి తీసెయ్యండి. మళ్ళీ మళ్ళీ మాట వినదు." స్టాఫ్ తో చెప్పాను.

అతను పక్కనే నుంచున్నాడు. అతని చెయ్యి పట్టుకునే గొడవచెయ్యకుండా పడుకుంది. ఎక్కువ మాట్లాడకుండా గబగబా పనికానిచ్చేశాము.

ఆ అమ్మాయిని పరీక్ష, స్కానింగ్ పూర్తి చేసి రాఘవరావుని పిలిచాను. " లోపల బిడ్డ పెరుగుదలా, అదీ బాగానే ఉంది. ఓ అరగంట సేపు కూర్చుంటే రక్త పరీక్షలు రిపోర్ట్ కూడా వస్తుంది. మందులవి రాసిస్తాను. " అని చెప్పాను.

రాఘవరావు వాళ్ళను బయట కూర్చోమని చెప్పి, ఓపీలో మిగతా పేషంట్లను చూస్తున్నాను.

ఓ నిముషం తర్వాత వచ్చి, "రిపోర్ట్ వచ్చిందా, రక్తం సరిపోద్దా?" అడిగాడు రాఘవరావు.

"పరీక్షలు చేస్తున్నాంగా. తెలుస్తుందిలే. "

"ఏయాళవుద్దో ఈ పరీచ్చలయేప్పుడికి . ఈళ్ళమ్మ తొందరగా రమ్మంది."

ప్రతి అయిదునిముషాలకూ వచ్చి , రిపోర్ట్ అయిపోయిందా అయిపోయిందా అని అడుగుతున్నాడు. ఇతన్ని పంపిస్తే కానీ మిగతా పని చేసుకోలేనని, లాబ్ లో పని చేసే సాంబయ్యను పిలబోతుంటే అతనే వచ్చాడు.

"మేడం , ఒకళ్ళకు ట్రైడాట్ పాజిటివ్ వచ్చింది."

హెచ్ ఐ వి ఇన్ఫెక్షన్ ఎంత పాతబడినా సరే, ఆ టెస్ట్ పాజిటివ్ అన్న మాట వినగానే , మొదటిసారి వింటున్నట్లు ఉలికిపడతాము.

"ఎవరిదీ?"

"పి . వెంకట లక్ష్మి "

అంటే రాఘవరావు కూతురిది.

'ఇదేంటీ' ఆశ్చర్యంగా నిలబడ్డాను.

బ్లడ్ టెస్ట్ రిపోర్టు కాగితాలు నా టేబిల్ మీద పెట్టాడు సాంబయ్య.

ఇంతలో రాఘవరావొచ్చి, అతన్ని గుర్తుపట్టి "ఇదిగో నువ్వేగా మాయమ్మాయి నెత్తురుపరీచ్చకని తీసుకెల్లావు . మా యమ్మాయి పరీచ్చలు అయిపోయాయా? రక్తం బాగానేఉందా?" అడిగాడు.

టేబిల్ మీద పెట్టిన రిపోర్టులు అవేనన్నట్టు సంజ్ఞ చేసి వెళ్ళిపోయాడు సాంబయ్య.

"రక్తం సరిపోనూ ఉందా?" నన్నడిగాడు.

"రక్తం కొంచం తక్కువగానే ఉందనుకో.. కానీ ఒక ముఖ్యమైన---"

"నేజెప్పలా, రక్తం పట్టడానికి మంచి మందులు, టానిక్కులు రాసియ్యి."

ఈ రాఘవరావుకు ఏమని చెప్పను.

"రాఘవరావు, మీ అల్లుడిని పిలువు." తెలియకుండానే కటువుగా అన్నాను.

అంత చిన్న పిల్ల, అమాయకురాలు. అతన్ని ఎంతగా నమ్ముతోంది. 'ఛీ ---.వెధవలు. పెళ్ళిళ్ళు చేసుకోవడం. రోగాలంటించడం.'

పెళ్ళికి ముందు హెచ్ ఐవి టెస్ట్ తప్పని సరి అనే చట్టం ఒకటుంటే ఎంత బాగుంటుంది. దానివల్ల ఎవరికీ నష్టం లేదే.. ఆ అమ్మాయిని చూస్తే మరీ చిన్న పిల్లలా ఉంది. అంతలోనే పెళ్ళి, కడుపు, హెచ్ ఐ వి కూడా. ఇప్పుడీ పిల్ల పరిస్థితి ఏంటి.

"పిల్లదానికి జిలేబి తెద్దామని ఎల్లాడు. మరి మందులు రాసిత్తే, మేమెల్తాం" అన్నాడు.

"రాఘవరావు, కూర్చో."

"వొద్దులే!"నిల్చునే ఉన్నాడు.

"అలా కాదు. కూర్చో ఓ మాట చెప్తాను."

నా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"రాఘవరావు. రేపోసారి మీ ఆయావిడను రమ్మను."

"అమ్మో అదొత్తే ఎట్టా? కొట్టు కాడ ఎవురుంటారు?"

"------."

"ఇంతకూ లోపలున్నది పిల్లా పిల్లగాడా. పిలగాడే అయుంటాడు. టీవీ పరిచ్చలో అగపడద్దంటగా ?"

వాళ్ళ అల్లుడు వచ్చాడని చెప్పారు స్టాఫ్.

ఆ అబ్బాయి వచ్చాడంటే గుండె వేగంగా కొట్టుకుంది.

"ఒరే కిట్టయ్యా లోపలకు రా---" తలుపు తీసి బయటున్న అల్లుణ్ణి పిలిచాడు.

"నెమ్మది---. నెమ్మదిగా మాట్టాడు." నర్సు నెమ్మదిగానే కటువుగా అంది.

ఆ అబ్బాయి లోపలికొచ్చాడు. అతణ్ణి అంటుకునే వచ్చింది వెంకట లక్ష్మి. చేతిలో జిలేబీ పొట్లాం కాబోలు. ఇష్టంగా పట్టుకుని వచ్చింది. అప్పటికి మొహంలో కోపం తగ్గి ప్రసన్నంగా ఉంది. పెళ్ళిచేసుకుని హె ఐ వి అంటించిన వాడు!

"ఏం పని చేస్తావ్?"

"ఆటో తోల్తానమ్మా.."

"ఎప్పుడైనా రక్త పరీక్షలు చేయించుకున్నావా?"

"పోయినేడు మలేరియా వస్తే ఇంటికాడే పరీచ్చలు చేశారమ్మా."

"ఇప్పుడు , నువ్వు కొన్ని పరీక్షలు చేయించుకోవాలి." చెప్పాను.

"సరే నమ్మగారూ రాసివ్వండి."

కాగితం రాసి రాఘవరావు చేతికిచ్చాను. ఎందుకూ ఏమిటీ అని అడక్కుండా, వెంటనే ఆ చీటీ తీసుకుని రివ్వుమనివెళ్ళాడు.

కాసేపటికి మళ్ళీ వచ్చి, " బ్లడ్ ఇచ్చేశా మేడం, రిపోర్టులకు టైం పట్టిద్దంట, లక్ష్మికి ఆకలేస్తందంట. రేపు నేనొచ్చి తీసుకుంటే సరిపోద్దా?" అని అడిగాడు.

టైం చూస్తే పావుతక్కువ పది అవుతోంది. ఆ అబ్బాయిని చూస్తున్నకొద్దీ వళ్ళు మండుతోంది. భార్యను బాగా చూసుకుంటున్నట్లు నాముందు నాటకాలు.

"సరే.." అన్నాను.

రాఘవరావు లోపలికొచ్చాడు . "మరిమేమెల్తాం. రేపు కిట్టయ్యొత్తాడు. " కూతురి ఫైలు రౌండ్ గా రూళ్ళకర్ర చుట్టినట్టు చుట్టి నా టేబిల్ మీద కొడుతూ అన్నాడు.

"సరే... అదట్లా పాడుచెయ్యొద్దు." పక్కనే ఉన్న నర్సు దాన్ని విడదీసి అతని చేతికిచ్చింది.

"రేపోసారి మీయావిడను తప్పకుండా తీసుకురా." మళ్ళీ చెప్పాను.

"రేపు కిట్టయ్యొత్తాడు లే . మళ్ళా అదెందుకూ. అదొత్తే షాపుకాడెవురుంటారు " అంటూ వెళ్ళాడు.

"పేషెంట్లు అందరూ వెళ్ళిపోయారు మేడం" నర్సొచ్చి చెప్పింది.

విషయం తెలిసిన వెంటనే కౌన్సెలింగ్ చెయ్యాలి. అది చెయ్యకుండా పంపిస్తున్నందుకు నామీద నాకే విసుగు, చిరాకుగా ఉంది. నా కన్సల్టేషన్ రూం పక్కనే రోడ్ కనిపిస్తుంది. ఆ కిటికీ తీసి బయటికి చూస్తూ నుంచున్నాను. రాఘవరావు అల్లుడి ఆటో అక్కడే పార్క్ చేసి ఉంది. స్ట్రీట్ లైట్ల వెలుగులో కొత్త ఆటో మెరుస్తోంది. వెనక సీట్లో ఏవో సరుకులు అవీ ఉన్నాయి. సరుకులన్నింటినీ జాగ్రత్తగా సర్ది భార్యను ఆటోలో కూర్చోమన్నాడు. ఆమె కూర్చునేటపుడు కాలిచెప్పు కిందపడిందని వెంటనే ఆటోకింద దూరి అది తీసి ఆమెకాలికి తొడిగాడు.

"మావా, నువ్వు ముందు కూసో"

రాఘవరావు ముందుసీట్లో ఇరుక్కుని కూర్చున్నాడు.

"నానా, నా జిలేబీ! లోపలే పెట్టాను." కెవ్వున అరిచింది వెంకట లక్ష్మి. ఒక్క నిముషంలో మెరుపులా వెళ్ళి తెచ్చాడు ఆ అబ్బాయి. మెడలో ఒక తాడులాంటిది తీసి ఆటో స్టార్ట్ చేశాడు. నిముషంలో వెళ్ళిపోయారు. అతని హుషారు, హడావుడీ చూస్తుంటే, తనకి హెచ్ ఐ వి ఉంటుందేమోనన్న అనుమానంకూడా ఉండి ఉండదనిపించింది. వీళ్ళకు ఎలా చెప్పాలీ... ఎప్పుడు చెప్పాలీ. పదిన్నర వరకూ నా రూం లోనే కూర్చున్నాను. లాబ్ లో పనిచేసే సాంబయ్య వచ్చి, హాస్పిటల్ తాలూకు ముఖ్యమైన తాళాలు, ఆ రోజు కలెక్షన్ టేబుల్ మీద పెట్టాడు.

"చివరగా ఓ అబ్బాయి బ్లడ్ ఇచ్చాడుకదా . అతని రిపోర్ట్ ఇవ్వు" అన్నాను. తీసిచ్చాడు.

పి. కృష్ణ కుమార్. వయసు 24. హెచ్ ఐ వి – నెగటివ్ అని ఉంది. మళ్ళీ ఉలిక్కి పడ్డాను. భార్యకు హెచ్ ఐ వి పాజిటివ్. భర్తకు నెగటివ్

ఇదెట్లా..

"సాంబయ్యా, ఈ టెస్టులు అవీ జాగ్రత్తగానే చేశావా?"

"చేశాను మేడం."

"రేపోసారి ఇద్దరికీ మళ్ళీ టెస్ట్ రిపీట్ చెయ్యి."

సాంబయ్య ఎన్నో ఏళ్ళనుండీ చేస్తున్నాడు. ఒక్కసారికూడా పొరపాటనేది జరగలేదు. అలా అన్నందుకు నొచ్చుకోకుండా "సరే మేడం. ఇప్పుడే ఫోన్ చేసిరేపు ఇద్దర్నీ రమ్మనమంటాను."

★★★★★★

ఉదయాన్నే మెలకువ వచ్చింది. గబగబా రెడీ అయి వాకింగ్ చేసే క్లబ్ వైపు వెళ్ళాను. తెలతెలవారుతోంది. రాఘవరావు బండి వైపు వెళ్ళాను. అతని భార్య అప్పటికే మార్కెట్ నుండి తెచ్చిన ఆకుకూరల మూట విప్పి సర్దుతోంది. ఆటైములో ఆమె పక్కనే కారాపబోయి, మరీ తెల్లవారుజామునే ఎలా చెప్తాం. పోనీ సంతోషకరమైన వార్త కూడా కాదు. అంటూ వాకింగ్ క్లబ్ కు వెళ్ళిపోయాను. కష్టపడి కాస్త తెల్లారేవరకు అక్కడ కాలక్షేపం చేసి రాఘవరావు బండి దగ్గర కాకుండా దూరంగా కారాపి చూస్తే షాపు దగ్గరా, బండి దగ్గరా విపరీతమైన రద్దీ. అల్లుడు కూడా సహాయం చేస్తున్నాడు. రాఘవరావు ఆ పక్కనే ఉన్న మటన్ కొట్టు దగ్గర ఎవరితోనో కబుర్లాడుతున్నాడు. కాస్త రద్దీ తగ్గేవరూ ఆగి కూరగాయల బండి దగ్గర కారాపాను. రాఘవరావు భార్య కారు దగ్గరకొచ్చింది.

"అమ్మా. రాత్రి అమ్మాయిని చూశారా. అంతా బాగానే ఉందా?"

ఆమె ప్రశ్నకు "ఓ సారి మళ్ళీ హాస్పిటల్ కు రావాలి మీరు" చెప్పాను.

"ఏమ్మా, ఏవైనా తేడా ఉందా? తల్లీ బిడ్డా బాగానే ఉన్నారనిజెప్పావన్నారు."

"ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారుకానీ ఓ సారి తీరికచేసుకుని హాస్పిటల్ కు రావాలి. ఎంత త్వరగా అయితే మంచిది. "

ఆ మధ్యాహ్నం మళ్ళీ వచ్చారు. మళ్ళీ ఇద్దరికీ టెస్ట్ చేయించాను. అదే రిపోర్ట్. వెంకట లక్ష్మి పాజిటివ్. అతనికి నెగటివ్. ఆ అమ్మాయికి ఎక్కణ్ణుంచి వచ్చింది హెచ్ ఐ వి . తల్లినుండి వచ్చిందేమోనన్న అనుమానం తీర్చుకోవడానికి ఇంట్లో మిగతా వారికి కూడా చేశాము. కుటుంబంలో అందరూ నెగటివ్. వెంకట లక్ష్మికి మాత్రం ఎలా వచ్చిందో అర్థం కాలేదు. ఆ అమ్మాయి తల్లిని నా రూం లో కూర్చోబెట్టి తలుపు వేసి అడిగాను.

"చిన్నపిల్లగాఉన్నపుడు ఎప్పుడైనా హాస్పిటల్ లో చేర్చారా. రక్తం ఏమైనా ఎక్కించారా?"

"లేదమ్మా. టీకాలు తప్ప ఎప్పుడూ ఇండీషన్లేయించనే లేదు."

"..........."

"ఎప్పుడైనా జొరమొస్తే, మందుబిళ్ళ మింగిచ్చడవేగానీ, ఇండీషన్లెరగదు"

"ఏవైందమ్మా, ఏదైనా తేడా ఉందా?"

"రాజమ్మా, చెప్పేది భయపడకుండా విను. అమ్మాయి ప్రస్తుతానికి ఆరోగ్యంగా నే ఉంది. మందులవీ వాడుకుంటే అందరిలానే ఆరోగ్యంగా గడపగలదు. కాకపోతే అమ్మాయి రక్తం లో హెచ్ ఐ వి ఇన్ఫెక్షన్ ఉంది."

హెచ్ ఐ వి అంటే ఏమిటో, అది ఎలా వస్తుందో చెప్పి, వెంకట లక్ష్మి కి మాత్రమే ఉందనీ, అల్లుడికి లేదనీ చెప్పాను.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాను. లోపల బిడ్డకు ఇన్ఫెక్షన్ రాకుండా ఉండేందుకు మందులు వాడాలనీ, మామూలు కాన్పు ద్వారా బిడ్డకు

హెచ్ ఐ వి సోకే ప్రమాదముంది. కాబట్టి, సిజేరియన్ చెయ్యాలనీ బిడ్డకు ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడవచ్చు. తల్లి పాలు కాకుండా డబ్బా పాలు పట్టాలనీ చెప్పి అలా చేస్తే బిడ్డకు ఇన్ఫెక్షన్ రాకుండా చెయ్యొచ్చు అన్నాను. "

అబ్బాయికి ఈ విషయం ముందు తెలియపరచాలి.

కళ్ళనీళ్ళు పెట్టుకుంది. " ఈ ఇసయం తెలిస్తే పిల్లనొదిలెయ్యడా?"

"దాచి ఉంచడం తప్పు కదా రాజమ్మా."

హెచ్ ఐ వి స్పెషలిస్ట్ రమణయ్య గారని సీనియర్ మెడికల్ ఆఫీసర్. గవర్నమెంట్ హాస్పిటల్ లో చేస్తారు. కౌన్సెలింగ్ అదీ బాగా చేస్తారు. మరిన్ని జాగ్రత్తలు వివరంగా తెలుసుకోవడానికి వీలుగా ఆయన దగ్గరకు ఆ అబ్బాయినీ, వెంకట లక్ష్మినీ కౌన్సెలింగ్ కు పంపించాను.

రాజమ్మ నాదగ్గరే కూర్చుంది. చేతులురెండూ వళ్ళో పెట్టుకుని మౌనంగా ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. ఉండీ ఉండీ రెండునిముషాలకోసారి ఏదో గుర్తొచ్చినట్లు మాట్లాడుతోంది.

"అల్లుడైనా సరే , కొడుక్కన్నా ఎక్కువగా సూసుకుంటాడు మమ్మల్ని. అన్ని పనులూ సేత్తాడమ్మా. ఒక్కపాలి కూడా పిల్లను కసురుకోడు. అర్ధ రేతిరైనా సరే పిల్లేదైనా కావాలందంటే సాలు , గబగబా సొక్కా ఏసుకుని బజారెల్తాడు. అయ్యకు మల్లేనే ,అది ఎర్రిమాలోకం. పెనిమిటి అంటే పిచ్చి. ఆణ్ణొదిలిపెట్టి ఉండలేదు. ఆడొదిలేత్తే ఇది సచ్చిపోద్ది."

కాసేపాగి ఏదో ఆలోచన గుప్పున వెలిగినట్టు

"అమ్మా, పోనీ ముందు బాగా ఖరీదైన మందులయ్యా వాడు. నయమైనతర్వాత ఇద్దరూ కలిసుండొచ్చుగా."

"మందులు వాడితే ఆరోగ్యంగా ఉండొచ్చు. కానీ, శరీరంలోకి ప్రవేశించిన ఆ క్రిమిని తీసివెయ్యడం కుదరదు."

"పిల్లతో కలిసుండే దారిలేదా?"

"ఉందికానీ, జీవితాంతం అతను కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. దానికి ఒప్పుకుంటాడో లేదో తెలియదు. " అని వివరం చెప్పాను.

ఏదో గుర్తు వచ్చినట్లు వెక్కి వెక్కి ఏడ్చింది. కాసేపటికి ఏడుపాపుకుని

"ఏం చెప్పనమ్మ...మొగుడుండీ లేని బతుకైపోయింది. ఈడకు రాకమునుపు హైద్రాబాదు బస్తీ లో ఉండేటోళ్ళం. పిల్లది కూడా పెనిమిటిమాదిరి ఎర్రిబాగుల్ది. ఇద్దర్నీ ఇంటికాడ వొదిలి కూరలమ్మాటాకి బొయ్యేదాన్ని. బస్తీలో కుర్రోళ్ళు ఈళ్ళిద్దరికీ మాయమాటలెప్పి నల్లమందలవాటు సేశారు. ఇద్దరికీ మైకమవొచ్చేసి వొల్లూ పై తెలవకుండా నిదరబోయేవోళ్ళు. కుర్రోళ్ళు ఈ పిల్లను పాడుసేసేవోళ్ళంట. అట్టా ఓ రోజుకాదు, ఓ పూటా కాదు. ఎన్నాళ్ళుసాగిందో, పక్కింటోళ్ళు సెప్పేదాకా నాకూ తెలవదు. . తెలవంగానే ఎంటనే ఈడకు తీసుకొచ్చేశా. చిన్నమ్మకొడుకు వరసకు తమ్ముడవుతాడు, ఆడి కొడుక్కి జేసుకుంటానంటే అంతకన్నా కావల్సిందేటుందని పిల్లకు పెళ్ళిజేశా. బాగనే ఉన్నామనుకున్నాను గానీ ఇట్టా జరుగుద్దని అనుకోలేదు. అంతా దాసిపెట్టి సేసినందుకు దేవుడు పగబట్టేడు" మళ్ళీ కళ్ళ వెంబడి నీళ్ళ ధారలుగా కారుతూనే ఉన్నాయి.

ఏదో ఆలోచించుకుని వెంటనే కళ్ళనీళ్ళుపెట్టుకుంది. "మా ఎంకమ్మ ఉట్టి పిచ్చిదమ్మా. ఇట్టిట్టా అని తెలిస్తే బతకలేదు. ఎందులోనో దూకి సచ్చిపోద్ది."

చూస్తే జబ్బు పడిన దానిలా కనిపించింది ఆ క్షణంలో . నేను ఏమీ ఓదార్చకుండా కూర్చున్నాను. అసలేమని ఓదార్చాలి. ఇంతలో, చిన్న సర్జరీ ఉంటే నేను వెళ్ళాల్సి వచ్చింది.

"రాజమ్మ , కాసేపు దిగులుపడకుండా కూర్చో. మీ అల్లుడొస్తే కూర్చోమను. నేనిప్పుడే వచ్చేస్తాను. వెళ్ళొద్దని చెప్పు. " అని చెప్పి వెళ్ళాను.

★★★★★★

ఓ గంట తర్వాత డా. రమణయ్యగారు ఫోన్ చేశారు. "కౌన్సెలింగ్ ఇచ్చానమ్మా. అతనికి అన్నీ చెప్పాను. రిస్కులూ, తీసుకోవల్సిన జాగ్రత్తలూ అన్నీ చెప్పాను."

అప్పటికి అతను కూడా వచ్చాడు. అప్పటికి నేనూ ఆపరేషన్ నుండి బయటకొచ్చాను. రాజమ్మ ను , ఆమె అల్లుణ్ణీ పిలిచాను. వెంకట లక్ష్మికూడా అతన్ని అంటిపెట్టుకునే వచ్చింది. జరిగేది ఏమిటో అర్థంకాక ఏడుస్తోంది. ఏం చెప్పాలో. ఎలా చెప్పాలో అని అని నేను ఆలోచిస్తుంటే అతనే మొదలెట్టాడు. .

"దానికి ఆ జబ్బు ఎట్టా వచ్చిందో నాకు తెలవదమ్మగారు. అది మాత్రం ఉట్టి పిచ్చిది. దానికేపాపం తెలవదు. . నాకే దైనా రోగమొస్తే అది నన్ను ఒదిలిపెట్టదు. ఇప్పుడు దాన్ని వదిలి నేనూ బతకలేను. రేపు పిల్లపుడితే , దాన్ని పెంచుకోటం కూడా రాదు దానికి. ఏ జాగర్తలు తీసుకోవాలన్నా తీసుకుంటాను. ఏం మందులు వాడమన్నా వాడతాను. "

అతన్ని మనసులో నానా మాటలూ అనుకున్నందుకు తప్పుచేసినట్లనిపించింది. చెప్తుంటే అతనికళ్ళలో తడికనిపించి మరింత ఇబ్బంది పెట్టింది నన్ను. తల్లిలా మాట్లాడే అబ్బాయిని చూడడం నాకో గొప్ప అనుభవం. పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలు చేసే చాలామంది మగవాళ్ళు ఆరోగ్యంగా ఉంటేనే భార్యతో ఉంటారు. ఆమెకు చిన్న జ్వరం రాగానే 'నాకు చూసుకోవడం రాదండీ' అంటూ పుట్టింటికి పంపేస్తారు. లేదా అత్తమావల్నే రమ్మనమని కబురు చేస్తారు. వాళ్ళందరి మాటలకూ , ప్రవర్తనకూ ఎంతో బాధపడేదాన్ని, ఆ బాధ ఎంతో కొంత తీరింది ఇతని వల్ల .

★★★★★

ప్రతి సారీ చెక్ అప్ కు అతనే తీసుకొచ్చేవాడు. భార్య కోసం, ఒక కాంపౌండర్ లాగా చాలా పనులే నేర్చుకున్నాడు . ఎందుకంటే నర్సుల్ని కొన్ని సార్లు దగ్గరకే రానిచ్చేదికాదు. అతను పక్కనుంటే మాత్రం చెప్పినట్టు వినేది. ఆమెకు వేరే ప్రత్యేకమైన థియేటర్ లో ఆపరేషన్ జరిగింది. ఆడపిల్ల. బిడ్డకు ఇన్ఫెక్షన్ లేదని తెలిసి హాస్పిటల్ లో స్టాఫ్ అందరికీ స్వీట్స్ పంచాడు.

తల్లిపాలు పట్టకూడదు కాబట్టి డబ్బా పాలు పట్టేవాడు. ఆ సీసాలు ఉడకబెట్టడం, పాలుకలపడం అన్నీ దగ్గరుండి చూసుకునేవాడు. మొదట్లో అతన్ని అనుమానించినందుకు ఎప్పటికప్పుడు సిగ్గుపడేదాన్ని. భార్య డిశ్చార్జ్ అయే రోజున ఆటోని అలంకారం చేసి తీసుకొచ్చాడు.

వెంకట లక్ష్మిని జాగ్రత్తగా వెనక సీట్లో కూర్చోబెట్టాడు. పక్కనే రాజమ్మ. రాజమ్మ చేతిలో పాప. ఆటో లోపల , బయట మహేష్ బాబు, పవన్ కల్యాణ్, జూ. ఎంటీ ఆర్, ప్రభాస్ ఇలా అందరు హీరోలూ ఉన్నారు.

డ్రైవింగ్ సీట్లో మాత్రం 'హీరో' కృష్ణ. !!!

Post your comments

★★★